క్లుప్తంగా

ప్రమాదాల నివారణపై అవగాహన



కంచికచర్ల : అగ్నిప్రమాదాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని కంచిక చర్ల ఫైర్ అధికారి తలశిల శ్రీనివాసరావు సూచించారు. కంచికచర్ల జుజ్జూరు రోడ్డులో ఓ అపార్ట్‌మెంట్ వద్ద మంగళవారం అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్న సమయంలో పాటించాల్సిన జాగ్రతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మాక్ డ్రిల్ నిర్వహించి, కరపత్రాలను పంచిపెట్టారు. ఈసందర్భంగా తలశిల శ్రీనివాసరావు మాట్లాడుతూ వేసవిలో ఎక్కువగా అగ్నిప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందన్నారు. వంటగదిలో గ్యాస్ లీకయితే వెంటనే కిటికీలు తెరిచి ఉంచాలన్నారు. ఇంజిన్లు వేడెక్కడంతో ఆయా వాహనాలు కూడా అగ్నిప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నందున వాహన చోదకులు, ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బి.శ్రీను, ఎస్‌కె తాజుద్దీన్, బి.సంజీవ్‌వర్మ, షేక్ సుభాని, శ్రీనివాసరావు, జి.రాజశేఖర్, బి.జీవన్, ఎం.అశోక్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి



పెనుగంచిప్రోలు: వేసవి దృష్ట్యా మండలంలో అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని ఎంపీపీ మార్క పూడి గాంధీ సూచించారు. పెనుగంచిప్రోలు మండల పరిషత్ సమావేశం మంగళవారం ఎంపీపీ గాంధీ అధ్యక్షతన జరిగింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎటువంటి అజెండా అంశాలు లేకుండా, కేవలం తాగునీటి సమస్యపై చర్చించారు. గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకునేలా సమావేశంలో చర్చించారు. జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఎంపీడీవో హర్షసాయి, వైద్యాధికారి పి.ఇందిర. ఎంఈవో డి.రవీంద్ర, ఆయాశాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

20న మండల పరిషత్ సమావేశం

కంచికచర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20వ తేదీ బుధవారం ఉదయం 10గంటలకు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ అత్తోట దీప్తి మంగళవారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, సంబంధిత అధికారులు తప్పక హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.

అమ్మజాన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ఎ.కొండూరు: మొహమ్మద్ ఖమ్రున్నీసా బేగం అమ్మజాన్ ఉరుసు గంధం మహోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా అమ్మజాన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. వేమూరు మండలం జంపని గ్రామంలోని ఏపీబీఎస్‌టీపీ దర్బార్ పీఠాధిపతి నిజాముద్దీన్ నిజామీ షా తాజ్ ఖాదరి పాల్గొని పూలు, గంధం, చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. పలువురు ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

మూడు బీరువాలు బహూకరణ

గంపలగూడెం: గంపలగూడెం ముత్యాలమ్మ ఆలయం, భజన మందిరాలకు మూడు బీరువాలను గంపలగూడెంకు చెందిన కొల్లా నాగేశ్వరరావు జ్ఞాపకార్థం భార్య కృష్ణకుమారి, కుటుంబ సభ్యులు కమిటీ సభ్యులకు అందజేశారు. గంపలగూడెం ముత్యాలమ్మ ఆలయంలోని నాగేంద్రస్వామికి ఇత్తడి మకర తోరణాన్ని కూడా వీరు సమర్పించారు. భజన మందిరం నిర్వాహకులు చారుగుండ్ల చిన్న హనుమంతరావు, పులిపాటి గాంధీ, దాత కుటుంబీకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కార్మికురాలు మృతి

ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ డిపోలో ఈనెల 9వ తేదీన విధినిర్వాహణలో విద్యుదాఘాతానికి గురైన కాంట్రాక్ట్ కార్మికురాలు సాలి మేరి (45) ఓప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. మేరిమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం, కాంట్రాక్టర్ రామకృష్ణతో చర్చలు జరిపారు. ఆమె కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు ఆర్థిక సహాయం కుటుంబ సభ్యులకు అందజేశారు.

రేపట్నుంచి నామినేషన్ల స్వీకరణ

పేట ఆర్‌ఓ జి.వెంకటేశ్వర్లు

పెనుగంచిప్రోలు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈనెల 18వతేదీ గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని జగ్గయ్యపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) జి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ ఆదివారం మినహా ఈనెల 25వతేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 11గంటల నుంచి సాయంత్రం మూడుగంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామని వివరించారు. ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గంలో రాజకీయపార్టీల ప్రచారంతోపాటు, ఆయా పార్టీల ఖర్చులను పరిశీలించేందుకు ఐదుగురు సహాయాధికారులతోపాటు ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఎన్నికల కమిషన్ నియమించినట్లు చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు, మద్యం పంపిణీ చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈనెల 18వతేదీ వరకు అభ్యర్థుల ప్రచార ఖర్చులను వారి పార్టీ ఖాతాలో, అనంతరం చేసే ఖర్చులను సదరు అభ్యర్థుల ఖాతాలో జమచేస్తామన్నారు. అభ్యర్థులు తమ నామినేషన్లు దరఖాస్తు చేసుకునేందుకు జగ్గయ్యపేట తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. నామినేషన్ వేసే అభ్యర్థులు కొత్తగా బ్యాంక్ ఖాతా తెరవడంతోపాటు రెండుస్టాంప్ సైజ్ ఫొటోలు అందించాలన్నారు. నామినేషన్ వేసేందుకు అభ్యర్థితోపాటు నలుగురిని మాత్రమే అనుమతిస్తామన్నారు. ఎన్నికల ప్రచారాలు రాత్రి పదిగంటల్లోగా ముగించాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలించామని, అవసరమైతే మరోసారి పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యేలా పటిష్ట ఏర్పాట్లు చేశామని వివరించారు.

మొత్తం ఓటర్లు 2,04,595 మంది..

జగ్గయ్యపేట నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,04,595మంది ఉండగా, వీరిలో పురుషులు 98,121మంది, మహిళా ఓటర్లు1,06,482మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 12మంది ఉన్నారన్నారు. నియోజకవర్గంలో మొత్తం 222 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఎన్నికల నిర్వహణ కోసం 1332మంది పోలింగ్ కేంద్రాల స్థాయి అధికారులు, 23మంది సెక్టార్ అధికారులు, 23మంది రూట్ ఆఫీసర్లు, ఆరు ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు, ఐదుగురు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు ఎన్నికల విధుల్లో పనిచేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలో 116 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బలగాలతోపాటు 148 వెబ్ కెమెరాలు, 75 మంది వీడియో గ్రాఫర్లు, 81మంది మైక్రో అబ్జర్వర్‌లను నియమించినట్లు వివరించారు. ఓటర్లలో 85ఏళ్ల పైబడినవారు 935మంది ఉండగా, వీరు పోలింగ్ కేంద్రాలకు రాలేరని ఎన్నికల అధికారులు నిర్ధారించిన మీదట వారు ఇంటివద్ద నుంచే ఓటుహక్కును వినియోగించుకునే సదుపాయాన్ని కల్పిస్తారని తెలిపారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌ఓ జి.వెంకటేశ్వర్లు

రూ.62.59లక్షలు సీజ్...

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు జగ్గయ్యపేట నియోజకవర్గంలో రూ.62.59 లక్షలు నగదు, రూ.5 లక్షల విలువైన మద్యం సీజ్ చేసినట్లు ఆర్‌ఓ తెలిపారు. నియోజకవర్గంలోని గరికపాడు, ముక్త్యాల, గంద్రాయి, వత్సవాయి, శివాపురం సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద 24గంటలపాటు వాహనాల తనిఖీ సాగుతోందని వివరించారు. ప్రతిఒక్కరు ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలని ఆర్‌ఓ సూచించారు.

ఎన్నికల నిర్వహణపై సమీక్ష

నందిగామ: నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందిలేకుండా మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆర్డీవో, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావు సూచించారు. తన కార్యాలయంలో నందిగామ నియోజకవర్గ సెక్టార్, రూట్ అధికారులు, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ బృందం, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో మంగళవారం ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈనెల 18వతేదీ నుంచి నామినేషన్ల పక్రియ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆయా అంశాలపై చర్చించారు. ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించుకునేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నందిగామ తహసీల్దార్ వై.సరస్వతి, డివిజన్ స్టాటిస్టికల్ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.



సెక్టార్, రూట్ ఆఫీసర్లతో మాట్లాడుతున్న నందిగామ ఆర్‌ఓ రవీంద్రరావు

వైఎస్సార్ సీపీలో చేరిక

పెనుగంచిప్రోలు: మండలంలోని కె.పొన్నవరం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు జక్కులూరి రంగారావు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఉదయభాను ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్కపూడి గాంధీ, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షులు వూట్ల నాగేశ్వరరావు, సుబ్బాయిగూడెం సర్పంచి పాపినేని వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



రంగారావుకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న విప్ ఉదయభాను

వీఆర్వోలతో సమీక్ష

జుజ్జూరు(వీరులపాడు): వీఆర్వోలు ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని తహసీల్దార్ రాజాకిషోర్ ఆదేశించారు. మండలంలోని జుజ్జూరులో తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన మౌలికవసతులు కల్పించాలన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించేవారి సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ ఆంజనేయులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో భారీ బైక్‌ర్యాలీ





ఎస్సీల ఆత్మీయ సమావేశం సందర్భంగా జగ్గయ్యపేట పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గ ఎస్సీల ఆత్మీయ సమావేశం సందర్భంగా పట్టణంలో ఎస్సీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా సాగిన ఈ భారీ ర్యాలీలో పెద్దఎత్తున టపాసులు కాలుస్తూ సందడి చేశారు. నియోజకవర్గంలోని 75 గ్రామాల నుంచి తరలివచ్చిన ఎస్సీలు పట్టణంలోని శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాలలో జరిగే ఎస్సీల ఆత్మీయ సమావేశానికి భారీగా తరలివెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నివాసం నుంచి ప్రారంభమైన ఈర్యాలీలో జగ్గయ్యపేట టౌన్, జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలతోపాటు నందిగామ మండలంలోని ఏటిపట్టు గ్రామాల నుంచి ఎస్సీలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ర్యాలీలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, సోషల్ జస్టిస్ సలహాదారు, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్, నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, పార్టీ యువనేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపూడి గాంధీ, కౌన్సిలర్ రోశయ్య, పెనుగంచిప్రోలు మండల పార్టీ అధ్యక్షుడు కనకపూడి భాస్కరరావు, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, మాజీ ఎంపీపీ మాతంగి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఉదయభాను, ఎంపీ సురేష్, జూపూడి

శరవేగంగా అభివృద్ధి పనులు

- కొనసాగుతున్న కల్వర్టు నిర్మాణం
- చురుగ్గా జీలజీవన్ మిషన్ పనులు
- దశాబ్దాల నాటి సమస్యలకు పరిష్కారం

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలులో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ప్రత్యేక చొరవతో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెనుగంచిప్రోలు చెరువుకు వరద నీరు వచ్చే గండివాగు ఏటా వర్షాలు పడిన సమయంతో ఉప్పొంగుతుండటంతో రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులుపడుతున్నారు. సాగుకు సంబంధించి పనిముట్లు, ఎరువులు, విత్తనాల తరలింపుతోపాటు కూలీల రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. గండివాగుపై కల్వర్టు నిర్మించాలని గత పాలకులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. పంచాయతీ ఎన్నికల సమయంలో గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు స్థానిక ఎమ్మెల్యే ఉదయభాను గండివాగుపై కల్వర్టు, అక్కడి నుంచి గ్రామంలోని రోడ్డు వరకు తారురోడ్డు నిర్మాణానికి డీఎంఎఫ్‌టి నిధులు రూ.కోటి మంజూరు చేయించారు. ఈ నిధులతో చేపట్టిన పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. కల్వర్టు నిర్మాణానికి సంబంధించి కాంక్రీట్ బెడ్ పూర్తి చేశారు.

సంప్ పనులు ప్రారంభం...

అదేవిధంగా పెనుగంచిప్రోలులోని తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మునేరు అవతలి ఒడ్డు నుంచి పైపులైన్ నిర్మాణం, స్టోరేజీ సంపు, ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి సంబంధించి జలజీవన్ మిషన్ నిధులు రూ.2.18 కోట్లు మంజూరయ్యాయి. ఈనిధులతో తూర్పు బజారు, డౌన్ సెంటర్‌లో పైపులైన్ నిర్మాణం పూర్తయింది. స్టోరేజీ సంపు నిర్మాణానికి సంబంధించి కాంక్రీట్ బెడ్ పనులు సాగుతున్నాయి. గండివాగుపై కల్వర్టు నిర్మాణంతోపాటు, జలజీవన్ నిధులతో చేపట్టిన సంప్ నిర్మాణం పనులు చురుగ్గా సాగుతుండటంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సర్పంచి వేల్పుల పద్మకుమారి, జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తగిన చర్యలు తీసుకోవడంపై సంతోషం వ్యక్తంచేస్తూ వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.త్వరితగతిన పనులు పూర్తిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సాగుతున్న స్టోరేజీ సంపు కాంక్రీట్ పనులు



గండివాగుపై చేపట్టిన కల్వర్టు నిర్మాణ పనులు

ఇచ్చిన హామీ మేరకు..



రైతులకు ఇబ్బందులను తొలగించేందుకు గండివాగుపై కల్వర్టు నిర్మాణం చేపట్టాం. ఎమ్మెల్యే ఉదయభాను సహకారంతో కల్వర్టు నిర్మాణం సాధ్యమైంది. జలజీవన్ నిధులతో చేపట్టిన పనులు పూర్తయితే గ్రామంలోని నెలకొన్న మంచి నీటి సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం లభించినట్లే. నాహయాంలో జలజీవన్ పనులు, కల్వర్టు నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉంది.

– వేల్పుల పద్మకుమారి, సర్పంచి

ప్రజల ఆదరాభిమానాలు మరువలేనివి

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: నందిగామ నియోజకవర్గ ప్రజలు తమపై చూపుతున్న ఆదరాభిమానాలు మరువలేనివని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి వారి ఆలయం రోడ్డు, ఆర్చి రోడ్డు, ఆర్‌సీఎం చర్చి, సచివాలయం రోడ్డు తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్ల ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని వివరించారు. నందిగామ పట్టణంలో ఈ ఐదేళ్ల చేపట్టిన అభివృద్ధికి సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఫ్యాను గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. ఇంటింటి ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్యే జగన్‌మోహనరావుకు ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు.

అభివృద్ధిపథంలో వార్డులు..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నందిగామను అన్నిరకాలుగా అభివృద్ధి చేశామన్నారు. నందిగామలోని అన్ని వార్డులు అభివృద్ధిబాటలో సాగుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో కనీసవసతులు లేని వార్డులు, నేడు ప్రజలకు అవసరమైన అన్ని వసతులతో అభివృద్ధి చెందాయన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీకే దక్కిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని.. గత పాలకులు ఎందుకు చేయలేకపోయారో ఒక్కసారి ఆలోచించుకోవాలని ఆయన సూచించారు. ఈ ఐదేళ్లలో ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసి చూపించానని జగన్ మోహనరావు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసి ప్రజల ముందుకు సగర్వంగా వస్తున్నామని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఘనవిజయం అందించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, వార్డు కన్వీనర్ నాదెండ్ల నరేంద్ర, నాయకులు చిరుమామిళ్ల చైతన్యకుమార్, నెలకుదిటి శివనాగేశ్వరరావు, షేక్ మున్నా, షేక్ యాకుబ్ అలీ, ఓర్సు కొండ, షేక్ ఫాతిమా, షేక్ మున్నా, మన్నెం దాసు, వినుకొండ రామారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆర్చి రోడ్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

మేలు చేకూరితే అండగా నిలవండి

ఎమ్మెల్సీ అరుణకుమార్

కంచికచర్ల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో ప్రతి కుటుంబానికి మేలు చేకూరిందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మేలు చేకూరితేనే తిరిగి మరోసారి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావును ఆశీర్వదించి మరోసారి గెలిపించాలని ఆయన కోరారు. మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో మంగళవారం రాత్రి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ, గ్రామసచివాలయాల ద్వారా ప్రజలకు ఎన్నో సంక్షేమం, అభివృద్ధి పథకాలు అందించామన్నారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అని కొనియాడారు. నందిగామలో కూటమి తరఫున డమ్మీ అభ్యర్థి పోటీచేస్తోందని ఎద్దేవా చేశారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే మంచి నాయకుడైనా డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావును మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, సొసైటీ అధ్యక్షుడు ఆలోకం శ్రీనివాసరావు, శివాలయ చైర్మన్ ఆలోకం శ్రీనివాసరావు, గ్రామ పార్టీ కన్వీనర్ గుదే అక్కారావు, నాయకులు గుదే సాంబశివరావు, చింతా రవీంద్రనాథ్, మంగలపూడి సన్నీ, మంగలపూడి కోటిబాబు, తంగెళ్లమూడి రామారావు, యర్రగుంట జగ్గయ్య, యర్రగుంట శ్రీనివాసరావు, గుదే నారాయణరావు, ములకలపల్లి శేషగిరిరావు, పరిటాల రాము, వేల్పుల రమేష్, పాల్గొన్నారు.




గొట్టుముక్కలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

శ్రీరామనవమికి ఏర్పాట్లు పూర్తి

పెనుగంచిప్రోలు: శ్రీరామ నవమి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలు, మండపాల వద్ద శ్రీసీతారాముల వారి కల్యాణోత్సవానికి భక్తులు ఏర్పాట్లు చేశారు. శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో కూడా శ్రీరామ నవమి వేడుకలకు ఆలయంలో విగ్రహాలకు రంగులు వేసి సిద్ధం చేస్తున్నారు. ఆలయంలో ఉదయం గం.11.08 నిముషాలకు కల్యాణం నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని ఆలయ అధికారులు కోరారు.

నందిగామలో...

నందిగామ: శ్రీరామనవమి ఉత్సవాలకు నందిగామలోని ఆయా రామాలయాలు ముస్తాబయ్యాయి. శ్రీసీతారాముల కల్యాణోత్సవం కోసం ఆలయాలు, కూడళ్లలో చలువ పందిళ్లు వేసి ప్రత్యేకంగా అలంకరించారు. నవమి వేడుకల్లో భాగంగా స్థానిక కూరగాయల మార్కెట్‌లోని సీతారామాంజనేయస్వామి వారి ఆలయంలో స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించి పూజలు చేశారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించేందుకు భక్తులు తగిన ఏర్పాట్లు పూర్తిచేశారు.



ముస్తాబైన పెనుగంచిప్రోలులోని కోదండ రామాలయం



పెండ్లి కుమారుడి అలంకరణలో రాముల వారు

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

తిరువూరు: స్థానిక సుగాలీ కాలనీలో ఓ వ్యక్తి నెల కిందట అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గుగులోతు గోపీకృష్ణ హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ ఇటీవల తిరువూరు వచ్చాడు. తన తల్లిదండ్రుల వద్ద ఉంటూ డీఆర్‌డీఏలో కాంట్రాక్టు ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. గత నెల 14న ఇంటి నుంచి వెళ్లిన గోపీకృష్ణ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని ఆచూకీకై గాలించారు. అతని ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం అతని తండ్రి పీక్యా నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తిరువూరు: తెలంగాణ రాష్ట్రం నుంచి కొనుగోలు చేసిన మద్యం సీసాలను ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న ఓ వ్యక్తిని తిరువూరు పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక సరిహద్దు చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా విజయవాడకు చెందిన సీహెచ్ రమేష్ బ్యాగులో తెలంగాణ మద్యం సీసాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం, సారా విక్రేతల అరెస్ట్

తిరువూరు: తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో మద్యం, సారా విక్రయిస్తున్న ముగ్గురిని మంగళవారం అధికారులు అరెస్ట్ చేశారు. విస్సన్నపేట మండలం కొండపర్వలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వలివెల రాధాకృష్ణ నుంచి 10 మద్యం సీసాలు, పంది రాజ్యలక్ష్మి నుంచి 12 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఎ.కొండూరు మండలం కుమ్మరికుంట్ల తండాలో గుగులోతు జంప్లి నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ల ఎదుట హాజరుపరచామని ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపారు.